క్లుప్తంగా

అవార్డులతో నూతనోత్సాహం


మహ్మద్ హసీనాను సన్మానిస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ (బుజ్జి)

యలమంచిలి: ప్రతి ఉద్యోగికి ప్రభుత్వం ఇచ్చే అవార్డులు నూతన ఉత్సాహాన్నిస్తాయని ఎంపీపీ రావూరి వెంకటరమణ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సూపర్‌వైజర్ అవార్డు పొందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనాను శనివారం సన్మానించారు. స్థానిక తమ్మినీడి ఉమా నరసింహ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ హసీనా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వనుం సత్యకల్యాణి, పొత్తూరి బుచ్చిరాజు, వల్లభు సాయి వెంకట నరసింహరావు, పాలంకి శ్రీనివాసరావు, చిలుకూరి సుబ్బారావు, కవురు గోపి పాల్గొన్నారు.

విరి కేదారం పుస్తకావిష్కరణ

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవిలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కీర్తిస్తూ విశ్రాంత ఉపాధ్యాయుడు చికమర్తి రచించిన విరి కేదారం పుస్తకావిష్కరణ శనివారం వేములదీవి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు చెన్నా ప్రగడ చక్రధరరావు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సుబ్రహ్మణ్య శాస్త్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఉంగరాల రమేష్ నాయుడు, మాజీ సర్పంచ్ అడ్డాల శ్రీనివాస్, కోటిపల్లి ఆనందరావు, చాగంటి ఆనంద్, అడ్డాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు జగనన్న తోడు

- ఉపాధికి ఊతమిచ్చేలా ఆర్థిక సాయం
- రుణం తీర్చిన వారికి మళ్లీ రుణం


నరసాపురంలో చేతి అల్లికతో చేసిన బుట్టలు విక్రయిస్తున్నర షేక్ షాజాబి


సరిపల్లిలో కిరాణాషాపు నిర్వహిస్తున్న ఆబోతుల వెంకటలక్ష్మి

నరసాపురం రూరల్: చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుంది. రూ.పది వేల వరకూ వడ్డీలేని రుణం అందించేందుకు ప్రభుత్వం జగనన్న తోడు పథకం అమలు చేస్తుంది. ఈ పథకం కింద చిరు వ్యాపారులతో పాటు బొమ్మల తయారీ, కలంకారీ పనులు, తోపుడు బండ్లపై వ్యాపారం చేసే వారికి ఏటా రూ.10వేల వరకూ వడ్డీ లేని రుణం అందజేస్తారు. అధిక వడ్డీ రేటుతో ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులను ఆదుకోవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందుకు సంబంధించిన మొత్తాల్ని కూడా నిర్ణీత వేళల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. జగనన్న తోడు పథకం అమలుతో రాష్ట్ర ప్రభుత్వం చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం ఇచ్చింది. చిరు వ్యాపారులను వడ్డీ వ్యాపారుల బారి నుంచి కాపాడేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న తోడు పథకం డబ్బులను ఇప్పటికే పలు విడతలుగా ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకం ద్వారా గతంలో తీసుకున్న డబ్బులు సకాలంలో చెల్లించిన వారికి ఏటా ఒక్కొక్కరికి రూ.10వేల రుణానికి సంబంధించి వడ్డీ రాయితీని కూడా అందజేస్తుంది.

సంక్షేమ కాలెండర్ ప్రకారం అమలు

అక్కా చెల్లెమ్మల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న పథకాలను సంక్షేమ క్యాలెండర్ ప్రకారం అమలు చేస్తుండటంతో ఆయా వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. జగనన్న తోడు పథకం కింద రుణం తీసుకుని ఆ మొత్తాన్ని వడ్డీతో సహా సకాలంలో బ్యాంకులకు తిరిగి చెల్లిస్తే ఆ వడ్డీని లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వమే నేరుగా జమ చేస్తుంది. రుణం తీర్చిన వారికి బ్యాంకులు మళ్లీ రుణం మంజూరు చేస్తాయి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి అర్హులకు రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని ఇప్పటికే ఎనిమిది విడతలుగా సాగుతుంది. జగనన్న తోడు పథకం ద్వారా అందిన సొమ్ములకు ఆసరా, చేయూత తదితర పథకాల ద్వారా అందిన సొమ్ములను జత చేసి మహిళలు వారి ఇళ్ల వద్దే చిన్న చిన్న వ్యాపారాలను ప్రారంభించి లాభాలను ఆర్జించి కుటుంబాలకు ఆర్థికంగా బాసటగా నిలుస్తున్నారు. జగనన్న తోడు పథకం ద్వారా వచ్చిన సొమ్ములతో వారి వారి చిరువ్యాపారాలు అభివృద్ధి చెంది ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

జగనన్న తోడు పథకం లబ్ధిదారులు

మండలం	లబ్ధిదారులు	జమైన సొమ్ము
నరసాపురం	1071	రూ.1.07 కోట్లు
మొగల్తూరు	795	రూ.0.79 కోట్లు

కిరాణా కొట్టు పెట్టుకున్నా



నేను ఇంటివద్దే కిరాణా దుకాణం నిర్వహించుకుంటున్నాను. జగనన్న తోడు పథకం ద్వారా రూ.10వేలకు తోడుగా వైఎస్సార్ ఆసరా సొమ్ము రూ.15,700 చొప్పున ఇప్పటి వరకూ మూడు పర్యాయాలు అందుకున్నాను. డ్వాక్రాలో ఇచ్చే శ్రీనిధి అప్పు రూ.50 వేలు తీసుకుని వ్యాపారం సాగిస్తున్నాను. ఇటీవలే ఉదయం పూట టిఫిన్ సెంటర్ కూడా నిర్వహిస్తున్నాను. మూడేళ్లుగా పథకాల సొమ్ములతో వ్యాపారాన్ని పెంచుకున్నాను. సరుకుల ఖర్చులు పోను రోజుకు రూ.400 వరకూ మిగులుతోంది.

– ఉంగరాల వెంకటలక్ష్మి, సరిపల్లి

మా కుటుంబం సంతోషంగా ఉంది



వివిధ రకాల అప్పడాలు, వడియాలు తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. జగనన్న ప్రభుత్వంలో నేను డ్వాక్రా గ్రూపు సభ్యురాలిగా ఉండి రూ1.60 వేలు రుణం పొందాను దానికి గాను సున్నా వడ్డీ పథకం కూడా వర్తిస్తుంది. ఓసీ కేటగిరిలో ఉన్న నాకు ఈబీసీ నేస్తం ద్వారా ప్రతి ఏటా రూ.15 వేలు కూడా అందుతున్నాయి. అలాగే వ్యాపార నిర్వహణకు జగనన్న తోడు కూడా అందిస్తున్నారు. జగనన్న ప్రభుత్వం మా కుటుంబం మొత్తం సంతోషంగా జీవిస్తుంది. – మానేపల్లి నాగశ్యామల, నరసాపురం

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు


పేరుపాలెం నార్త్‌లో బ్రోచర్‌ను అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మొగల్తూరు: కుల మతాలకతీతంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కోడెల్లి వెంక్రట్రావు తెలిపారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచనల మేరకు శనివారం ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందిన వివరాల బ్రోచర్‌ను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందించారు. పేరుపాలెం నార్త్ పంచాయతీలోని బెల్లంకొండ వారి మెరకలో పార్టీ నాయకులు ,గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబం పొందిన లబ్ధిని లబ్ధిదారుడికి వివరిస్తున్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కారుమంచి కృపాల్, సామ్యూల్ రాజ్, చంటిబాబు, మధుబాబు పాల్గొన్నారు.

చిట్టవరంలో..

నరసాపురం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ అభివృద్ధిని ఇంటింటికీ వివరిస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాకిలేటి ఆనంద కుమార్ అన్నారు. నరసాపురం మండలం చిట్టవరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశాల మేరకు బూత్ కన్వీనర్‌లతో కలిసి గడప గడపకూ వెళ్లి జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని గురించి వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరి ప్రభాకరరావు, ఏలూరి చంద్రశేఖర్, సబ్బితి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

మొగల్తూరు: స్థానిక కేతకీపుర సామ్రాజ్య భూసమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆలయ అర్చకులు గంగ పవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

సీఎం జగన్‌కి అండగా నిలవాలి


13వ వార్డులో దివ్యాంగురాలికి నవరత్నాల బ్రోచర్ అందజేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)


బూత్ కన్వీనర్ల సమావేశంలో సిద్ధం ప్లకార్డులతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: పేద, మధ్య తరగతి వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు పట్టణంలోని 13వ వార్డులో శనివారం పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా గోపి విలేకరులతో మాట్లాడుతూ జగనన్నతో జనం.. గోపన్నతో మనం కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళుతున్నప్పుడు వారే స్వయంగా నవరత్నాల పథకాల ద్వారా ఏ మేరకు లబ్ధి పొందారో వివరిస్తున్నారన్నారు. పట్టణ ప్రజలు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న డ్రైయినేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ఇప్పటికే ఒక ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పట్టణంలోని దమ్మయ్యపత్తి, బెజవాడకోడులను ప్రక్షాళన చేయనున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్న ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. పేదలకు ఇంటిస్థలాలు పూడిక పనులకు అడ్డుపడ్డారన్నారు. అసత్యప్రచారంతో ప్రజల్ని మోసం చేయడానికి సిద్ధపడుతున్నారన్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులను బ్యాంకులకు తాకట్టుపెట్టి, వారిని రుణగ్రస్తులను చేసిన ఘనత టీడీపీది అయితే పేదలందరికీ ఇళ్లు అనే లక్ష్యంతో ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కి దక్కుతుందన్నారు.

స్వర్ణకారులను కలిసిన గుడాల గోపి

పట్టణంలోని స్వర్ణకారుల సంఘ సభ్యులను గుడాల గోపి ప్రత్యేకంగా కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్వర్ణకార సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని గోపిని సంఘ సభ్యులు కోరారు. దీనిపై గోపి స్పందించారు. అనువైన స్థలం సభ్యులు చూసుకున్నట్లయితే మునిసిపల్ తీర్మానం చేయిస్తానన్నారు. లేకపోతే రెండు నెలలు ఆగితే తానే స్వయంగా ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని స్థలం కేటాయించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, అడబాల వెంకటరమణ, మద్దా చంద్రకళ, పెదపాటి పెద్దిరాజు, జోగి వెంకటేశ్వరరావు, మామిడి బాబు, నంబూరి పవన్, బీఎస్సార్ మూర్తి, యడ్ల సత్యనారాయణ, గుండుబోయిన నాగేశ్వరరావు, వార్డు నాయకులు వీరా శ్రీనివాసరావు, యాతం నానాజీ, గిరిజాపు రాజలింగాచారి, మద్దాల రామాంజనేయులు, గవర బుజ్జి పాల్గొన్నారు.

బూత్ కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలి

బూత్ కన్వీనర్లు బాధ్యతగా పనిచేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థిని పాలకొల్లులో గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పాలకొల్లు మండల బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా బూత్ పరిధిలో ఉన్న ఓటర్ల వివరాలను క్రాస్ చెక్ చేసుకోవాలన్నారు. గల్ఫ్ వెళ్లిన వారి జాబితాలు, గ్రామాంతరం వెళ్లిన వారి వివరాలు, స్త్రీలు, పురుషులు, యువజనులు, ప్రభుత్వ పథకాలు పొందుతున్న వారి వివరాలు జాబితాలు రాసుకుని సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే కొత్తగా ఓటు హక్కువచ్చిన వారి వివరాలు జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, యువజన విభాగం రాష్ట్ర నాయకులు ఉచ్చుల స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం


తూర్పుపాలెంలో అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం చేసిన సంక్షేమమే శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. బడుగు, బలహీన ,దళిత వర్గాలు, ఇతర అన్ని వర్గాలు సీఎం జగన్‌కు అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. దీంతో ప్రతిపక్షాలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. చంద్రబాబు ఒంటరిగా రాలేక దేశంలోని అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకొని ముందుకు వస్తున్నాయన్నారు. ఎంతమంది వచ్చినా సీఎం జగన్ ముందు నిలవలేరన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలోనూ సంక్షేమంతో పాటు, అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దంపన బోయిన బాబూరావు, కాకిలేటి బాపిరాజు, అల్లం భాస్కరరెడ్డి, దినేష్ రాజు, కీర్తి తాతాజీ, తిక్కిరెడ్డి పవన్‌కుమార్, పిల్లి చాముండేశ్వరావు, దొమ్మేటి దేవి రాజేష్, పూతినీడి శ్రీను, వెలగల శ్రీనివాస రెడ్డి, గుబ్బల వీర బ్రహ్మం, మేడిచర్ల పండు, కుడిపూడి సుబ్రహ్మణ్యం, దొంగ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజు పరామర్శ

పెనుగొండ: వైఎస్సార్ సీపీ నాయకుడు, పెనుగొండ మాజీ ఉప సర్పంచ్ నూలిధీరజ్ కుటుంబాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం పరామర్శించారు. నూలిధీరజ్ తల్లి వరలక్ష్మీ ఇటీవల మృతి చెందారు. వరలక్ష్మీ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి(బాబీ), వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నూలి రమణమూర్తి, శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నూలి తాతాజీ, తేతలి రామారెడ్డిలు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

నరసాపురం: విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని జె.సికిలే స్కూల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన గ్రాడ్యుయేషన్‌డే వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి పిల్లలు ప్రైవేట్ స్కూల్స్‌లో కూడా పెద్ద సంఖ్యలో చదువుతున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రహించి అమ్మఒడి పథకాన్ని ప్రైయివేట్ స్కూల్స్‌లో చదువుతున్న పిల్లలకు కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సికిలే పెర్సిపాల్, వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వడలిలో కేంద్ర బలగాల కవాతు

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘ నిబంధనలు పాటించాల్సిందేనని పెనుగొండ సీఐ నక్కా అజయ్‌కుమార్ అన్నారు. శనివారం వడలిలో కేంద్ర బలగాలు, పెనుగొండ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించాయి. ఎన్నికల నిబంధనలు ఎవరూ అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

పెనుగొండ: గ్రామాల్లో ఓటు హక్కుపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన కల్పించాలని పెనుగొండ సీఐ నక్కా రజనీ కుమార్ అన్నారు. శనివారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వడలిలో సేవా శిబిరాన్ని ప్రారంభించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ వైవీవీ అప్పారావు, సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన గంగా భవానీ బాబీ పాల్గొన్నారు.

శంభో.. శంకర


శివదేవ స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు


లక్ష రుద్రాక్ష పూజ నిర్వహించిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాలలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహించారు. శ్రీ పార్వతీ అమ్మవారి పుట్టిల్లు అయిన బల్లిపాడు గ్రామానికి కల్యాణ మూర్తులను రథంలో తీసుకువెళ్లారు. అక్కడ పుట్టింటివారైన భూపతిరాజు నరసింహరాజు, సంతోష్ వర్మలు అమ్మవారికి పుట్టింటి లాంచనాలు జరిపించారు. అనంతరం రథంలో గ్రామోత్సవం నిర్వహించారు. సర్పంచ్ భూపతిరాజు ఇందిరాదేవి, గోపిరాజు పాల్గొన్నారు. అలాగే లంకలకోడేరులో వేంచేసియున్న శ్రీ విశ్వేశ్వరస్వామికి శనివారం తెల్లవారుజామున లక్ష పత్రి పూజ ఘనంగా నిర్వహించారు. లింగోద్భవ సమయంలో స్వామివారికి అభిషేక పూర్వక లక్ష బిళ్వార్చన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ నిర్వహించారు.

ఘనంగా లక్ష రుద్రాక్ష పూజా మహోత్సవం

నరసాపురం రూరల్: కాపుల కొడపలో ఉన్న శ్రీ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష రుద్రాక్ష పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని మాఘ బహుళ చతుర్దశి సందర్భంగా స్వామివారికి లక్షరుద్రాక్షలతో పూజా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ మంచిలి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో గన్నాబత్తుల కనకరాజు, శ్రీదేవి, గన్నాబత్తుల వెంకటేశ్వరరావు, నాగమణి దంపతులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: మహా శివరాత్రి నేపథ్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పూజలు శనివారం ముగిశాయి. గ్రామానికి చెందిన ఆత్రేయ జ్యోతిషాలయం పండితులు కిలాంబి బద్రీనాథ్ ఆచార్యులు ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, కలశ పూజ, శాంతి హోమం, నిర్వహించారు. ఆఖరిరోజు శనివారం హోమానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్